క్లుప్తంగా

చెంగల్వరాయస్వామికి పుర ఉత్సవం



పురవీధుల్లో దర్శనమిస్తున్న స్వామి

శ్రీకాళహస్తి: విజ్ఞానగిరిపై ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి వద్ద బుధవారం ధ్వజారోహణ పూజలు నిర్వహించారు. రాత్రి స్వామి వారు అంబారీపై విహరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ బాపిరెడ్డి, ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన వార్షిక వైద్య పరీక్షలు



మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు

రేణిగుంట: మండలంలోని అమర రాజా ఆడిటోరియంలో అమర హాస్పిటల్, కాంటినెంటల్ కాఫీ లిమిటెడ్, అమర రాజా గ్రూప్స్ సంయుక్తంగా మూడు రోజుల పాటు జిల్లావ్యాప్తంగా 2518 మంది పోలీసు సిబ్బందికి వార్షిక వైద్య పరీక్షలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ 0పోలీసు సిబ్బందికి వైద్య పరీక్షలు చేయించేందుకు సహకారం కావాలని అడిగిన వెంటనే ముందుకు వచ్చిన అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

శ్రీసిటీ టు బెంగళూరు ఏసీ స్లీపర్ బస్సు ప్రారంభం



శ్రీసిటీలో ప్రారంభమైన బస్సు సర్వీస్

శ్రీసిటీ (వరదయ్యపాళెం): శ్రీసిటీ నుంచి బెంగళూరుకు డైలీ ఏసీ స్లీపర్ నూతన బస్సు సర్వీసు ప్రారంభమైంది. ప్రముఖ అంతర్రాష్ట్ర ట్రావెల్ సంస్థ 'గో టూర్ ట్రావెల్స్ అండ్ హాలిడేస్' దీనికి శ్రీకారం చుట్టింది. రాత్రిళ్లు సౌకర్యవంతమైన ప్రయాణం కోరుకుంటున్న శ్రీసిటీ నివాసితులు, పరిశ్రమ నిపుణులు, ఇతర సందర్శకుల చిరకాల డిమాండ్‌ను ఈ సర్వీసు నెరవేర్చింది. ఈ బస్సు రోజూ శ్రీసిటీ నుంచి రాత్రి 8.30 గంటలకు బయలుదేరి ఉదయం 5.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బెంగళూరు నుంచి రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు శ్రీసిటీ చేరుతుంది. తడ, సూళ్లూరుపేట, నాయుడుపేట, శ్రీకాళహస్తి, తిరుపతి, చిత్తూరు, కోలార్, హోస్కోట్ మీదుగా ఇది వెళ్తుంది. స్థానికంగా శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద ప్రయాణికుల బోర్డింగ్, దిగేందుకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాట్లు చేసింది. టికెట్ బుకింగ్, మరిన్ని వివరాలకు www.gotour.co.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

ఏఎం పురంలో డెంగీ కేసులు నమోదు



వైద్యపరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ డాక్టర్లు

సత్యవేడు: మండలంలోని ఏఎం పురం పంచాయతీలో ఇద్దరు మహిళలు డెంగీ జ్వరం బారిన పడ్డారు. గ్రామానికి చెందిన కే.గీత(45), ఎం.గోవిందమ్మ (53)కు జ్వరం రావడంతో తమిళనాడులోని ఊత్తుకోటలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రిలోచేరారు. అక్కడ ఇరువురికి డెంగీ జర్వం ఉన్నట్లు తేలింది. మెరుగైన వైద్యం కోసం కే.గీత తిరువళ్లూరు జనరల్ వైద్యశాలలో, గోవిందమ్మ నారాయణాద్రి ఆస్పత్రిలో చేరింది. సమాచారం అందుకున్న దాసుకుప్పం వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్ బుధవారం ఏఎంపురంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సర్పంచ్ శిరీషా, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులురెడ్డి, సబ్‌యూనిట్ అధికారి మోహన్, ఎంపీహెచ్ఈఓ సుబ్రమణ్యం, ఏఎన్ఎం రేణుక, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



స్వామివారికి పూజలు చేస్తున్న పండితులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధ చెంగల్రాయస్వామి సన్నిధి వద్ద వైభవంగా ధ్వజారోగహణం పూజలు నిర్వహించారు. స్వామివారికి విశేష అభిషేక, హోమపూజలు జరిపారు. చెంగల్రాయస్వామి వద్ద ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు ఆధ్వర్యంలో కలశ స్థాపన పూజలు జరిపారు. అనంతరం ధ్వజారోహణ పూజలు చేపట్టారు. ఆలయ ఈఓ బాపిరెడ్డి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

అటకెక్కిన ఆర్వో ప్లాంట్లు

నాడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన నీటి వసతి కల్పించడానికి ప్రతి స్కూల్లో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసింది. కార్పొరేట్ స్కూళ్ల కంటే మిన్నగా సౌకర్యాల కల్పనకు పెద్దపీట వేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ స్కూళ్లపై శీతకన్ను వేసింది. ఆర్వో ప్లాంట్లు నిర్వహణను పట్టించుకోకపోవడంతో అవి పాడై పోతున్నాయి. ఫలితంగా విద్యార్థులకు నాణ్యమైన తాగునీరు లభించక పాత్రలు శుభ్రం చేస్తున్న నీటినే తాగాల్సిన దుస్థితి నెలకొని ఉంది.

- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం.. విద్యార్థులకు శాపం
- పాఠశాలల్లో పనిచేయని మినరల్ వాటర్ ప్లాంట్లు
- తాగునీటి కోసం విద్యార్థులకు అగచాట్లు
- నీటి వసతి మెరుగుపరచాలని కోరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు



మదనంబేడులో మరమ్మతులకు నోచుకోని ఆర్వో ప్లాంట్



సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలలో తాళం వేసిన ఆర్వో ప్లాంట్

సత్యవేడు: మండలంలో 67 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 51 ప్రాథమిక పాఠశాలలు, 8 జెడ్పీ, 2 ఉన్నత పాఠశాలలు, రెండు గురుకుల పాఠశాలలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో నాడు -నేడు పథకం కింద 30కి పైగా పాఠశాలలను ఎంపిక చేసి, విద్యార్థుల సంఖ్యను బట్టి, లక్షల రూపాయల వ్యయంతో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో అవి మూలన పడ్డాయి. ఫలితంగా పరిశుద్ధ జలం విద్యార్థులకు అందక ఇబ్బందులే కాకుండా రుగ్మతల బారిన పడ కుతున్నారు.

మరమ్మతులకు నోచని ఆర్వో ప్లాంట్లు

ఉన్నత పాఠశాలలో ఉన్న ఆర్వో ప్లాంటు మరమ్మతులకు నోచుకోవడం లేదు. పాఠశాల నిధులతో ఆర్వో ప్లాంట్లు రిపేర్లు చేయించడానికి ప్రధానోపాధ్యాయులు యత్నించినా స్థానికంగా ఆ ప్లాంట్లకు మరమ్మతులు చేసే టెక్నీషియన్లు లేరు. గతంలో ఆక్వా కంపెనీ ప్రతినిధులు వచ్చి వీటికి మరమ్మతులు చేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆర్వో ప్లాంట్ల మరమ్మతులకు టెక్నీషియన్లను కేటాయించకపోవడంతో 8 ఆర్వోప్లాంట్లు అటకెక్కాయి. రెండు స్కూళ్లలోనే వినియోగంలో ఉన్నాయి.

నిధులు స్వల్పం..ఖర్చు అధికం

విద్యార్థులు తక్కువ ఉన్న పాఠశాల నిధులు స్వల్పంగా మంజూరు కావడం.. ఆర్వో ప్లాంటు మరమ్మతుల ఖర్చు అధిక అవుతుండడంతో రిపేర్ల వ్యయం భరించలేక వదిలేస్తున్నారు. దీంతో పలువురు హెచ్ఎంలు మండల, జిల్లా అధికారులు సమాచారం ఇచ్చి స్కూళ్లలో ఉన్న బోరు నీటిని డైరెక్టు పంపింగ్ ద్వారా ట్యాంకు నీటిని విద్యార్థులకు ఇస్తున్నారు. ట్యాంకులు శుభ్రంగా లేకపోవడంతో ఆ నీటిని వినియోగించి తమ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థులు తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

ఉన్నత పాఠశాల పేరు		విద్యార్థుల సంఖ్య
సత్యవేడు బాలురు	-	407
సత్యవేడు బాలికలు	-	199
దాసుకుప్పం	-	146
ఇరుగుళం	-	179
కన్నావరం	-	149
మదనంబేడు	-	347
మాదనపాళెం	-	123
పీవీ పురం	-	74
పుదుకుప్పం	-	116
రాజగోపాలపురం	-	92



సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలలో నీళ్ల తొట్టి కొళాయిల వద్ద ప్లేట్లు కడుగుతున్న విద్యార్థులు, ప్లేట్లోనే నీరు తాగుతున్న విద్యార్థి

నాణ్యమైన నీరేదీ..?

పాఠశాలల్లో తాగునీరు, కలుషిత ఆహారం వల్లే విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇళ్ల నుంచి తీసుకెళ్తున్న నీరు భోజనానికి సరిపోతుంది. దప్పిక వేసి పిల్లలు పాఠశాలల్లో కొళాయి నీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. స్కూళ్లలో ఆర్వోప్లాంట్లకు మరమ్మతులు చేసి నాణ్యమైన తాగునీటిని పిల్లలకు ఇవ్వాలి. – ఇస్మాయిల్, సత్యవేడు

మరమ్మతులు చేయిస్తున్నాం..

కొన్ని స్కూళ్లలో ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదని మా దృష్టికి వచ్చింది. తక్కువ ఖర్చు అయ్యే ఆర్వో ప్లాంట్లను స్కూల్ గ్రాంటు నుంచి మరమ్మతులు చేయించాలని టీచర్లకు చెప్పాం. నాణ్యమైన తాగునీరు ఇచ్చే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. -కే.రవి, ఎంఈఓ, సత్యవేడు

నివాళి.. పరామర్శ



చిలమత్తూరులో చంగయ్య చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటిస్తున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: మండలంలో ఇటీవల చిలమత్తూరుకు చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకుడు వెంకటేష్ తండ్రి రెడ్డి చెంగయ్య, రాచర్లలో పార్టీ నాయకుడు దేవదాస్ తల్లి మంగమ్మ మరణించారు. బుధవారం జరిగిన దశదిన కర్మ క్రియల్లో సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పార్టీ శ్రేణులతో కలిసి హాజరయ్యారు. చంగయ్య, మంగమ్మ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఆయన వెంట సీనియర్ నాయకులు దామోదర్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్న, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు చిలమత్తూరు భాస్కర్ రెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ హరిబాబు రెడ్డి, రాష్ట్ర యూత్ సంయుక్త కార్యదర్శి శిబి చక్రవర్తి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ ప్రభాకర్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు చంద్రారెడ్డి, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షుడు బందిల సురేష్, సర్పంచ్ రమణయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నర్సులకు ఫిజియోథెరపీపై శిక్షణ

సత్యవేడు: ప్రభుత్వ వైద్యశాలల్లో పనిచేస్తున్న నర్సులకు ఫిజియోథెరపీపై శిక్షణ ఇస్తున్నట్లు సత్యవేడు కమ్యూనిటీ వైద్యశాల ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ సురేఖ తెలిపారు. బుధవారం సత్యవేడు కమ్యూనిటీ వైద్యశాలలోని నర్సులకు ఫిజియోథెరపీ క్లాసులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, ఫిజియోథెరపీతో శారీరక పనితీరును పెంచవచ్చన్నారు. శరీర నిర్మాణ శాస్త్రం, శరీర ధర్మశాస్త్రం, అధ్యయనం చేయాల్సి ఉంటుందన్నారు. దీనితో పాటు మనస్తత్వశాస్త్రం, సామాజిక శాస్త్రంపై అవగాహన పెంచుకోవాలన్నారు. దాసుకుప్పం, పిచ్చాటూరు, చిన్నపాండూరు, బుచ్చినాయుడుకండ్రిగ, ఎంపేడు, కోవనూరు ఆరోగ్య కేంద్రాలకు ఫిజియోథెరపీ పరికరాలు అందజేసినట్టు చెప్పారు.

'మధ్యవర్తిత్వం చేసి కేసులు పరిష్కరించండి'



మాట్లాడుతున్న జడ్జి వెంకటనాగరాజు

సత్యవేడు: పౌర శిక్షాస్మృతి పరిధిలో కేసులను రాజీ చేసుకుంటే పలు ప్రయోజనాలు పొందవచ్చని సత్యవేడు జూనియర్ సివిల్ కోర్టు జడ్జీ ఏ. వెంకటనాగరాజు అన్నారు. బుధవారం కోర్టు ఆవరణలో మీడియేషన్ ఫర్ ద నేషన్ కార్యక్రమం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ, రాజీకి వచ్చిన కేసులను న్యాయవాదులు మధ్యవర్తిత్వం చేసి పరిష్కరించే మార్గాలను కక్షిదారులకు వివరించాలన్నారు. మధ్యవర్తిత్వంతో కేసులు రాజీ అయితే బాధితుడు చెల్లించిన కోర్టు ఫీజు తిరిగి ఇస్తారన్నారు. కార్యక్రమంలో సీఐ మురళీ నాయుడు, బార్ అసోసియేషన్ సభ్యులు, ఎస్‌బీఐ మేనేజర్ సూర్యప్రకాష్, ఏపీపీ లత, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

నాగలాపురం: దళితవాడల్లో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని స్థానిక మాదిగవాడకు చెందిన దళితులు బుధవారం స్థానిక తహసీల్దార్ హనుమాన్ నాయక్‌కు వినతి పత్రం ఇచ్చారు. దీనికి నేతృత్వం వహించిన తిరుపతి జిల్లా ఎంఆర్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి రాగిపట్టు రాఘవయ్య మాట్లాడుతూ, కొన్ని మాదిగపల్లెల్లో ఆక్రమణలకు గురైన శ్మశాన వాటికలు, భూ సమస్యలను పరిష్కరించి వాటిపై ప్రత్యేక శ్రద్ధ వహించి దళితులకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నిరూపాక్ మస్తాన్, మాదిగ సంఘం మండల అధ్యక్షులు బొమ్మి నాగేష్, నాయకులు పరశురాం, పరంధామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థులే హాజరు..!



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని గాజులపెళ్లూరులోని ఫౌండేషన్ పాఠశాలకు బుధవారం ఇద్దరు విద్యార్థులే హాజరయ్యారు. మండల విద్యాశాఖాధికారి మునిసుబ్రమణ్యం పాఠశాల తనిఖీకి వెళ్లి, ఉపాధ్యాయుడితో కలసి ఇద్దరు విద్యార్థులతో ప్రార్థన చేయించారు. పాఠశాలలో ఒకటి, రెండు తరగతులకు కలిపి నలుగురు విద్యార్థులు మాత్రమే ఉండటం గమనార్హం! ఇద్దరు హాజరు కాలేదు.

ఇద్దరు విద్యార్థులతో ప్రార్థన చేయిస్తున్న ఎంఈఓ మునిసుబ్రమణ్యం

పోషకాహారంపై అవగాహన సదస్సు

ఏర్పేడు: మండలంలోని ఎస్ఓఎస్ చైల్డ్స్ విలేజ్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుటుంబ బలోపేత కార్యక్రమంలో భాగంగా బుధవారం పోషకాహారం సమతులాహారంపై ప్రత్యేక అవగాహన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణలో భాగంగా మహిళలకు పోషకాహారంపై అవగాహన పెంపొందించి, కుటుంబ సమగ్ర ఆరోగ్య అభివృద్ధికి దోహదపడేలా అవగాహన కల్పించారు. శిక్షణలో అక్కుర్తి, పల్లం, చింతలపాలెం క్లస్టర్ల నుంచి వచ్చిన 80 మంది సంరక్షకులు పాల్గొన్నారు. ప్రముఖ ఆరోగ్య, ఫిట్‌నెస్ నిపుణురాలు డా.గిరిజా కుమారి, న్యూరో, స్పైన్ సర్జన్, మోటివేషనల్ స్పీకర్ డా.అనంత్ కిరణ్ ముఖ్య వక్తలుగా పాల్గొని, శరీరానికి అవసరమైన ప్రాథమిక పోషక పదార్థాలైన విటమిన్లు, మినరల్స్, ప్రోటీన్ల ప్రాముఖ్యతపై శాస్త్రీయంగా వివరణ ఇచ్చారు. ఎఫ్ఎస్‌పీ లోకేషన్ ఇన్‌చార్జ్ సత్యనారాయణ, సహోద్యోగులు మునిరత్నం, వెంకటరమణ పాల్గొన్నారు.

అందుబాటులో ఉండండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని రైతు సేవా కేంద్రాలకు కొత్తగా వచ్చిన వీహెచ్ఏ, వీఏఏలు రైతులకు అందుబాటులో ఉండాలని ఏఓ షణ్ముగం ఆదేశించారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయానికి కొత్తగా వచ్చిన ఒక వీహెచ్ఏ, 8 మంది వీఏఏలకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఈ-క్రాప్ నమోదు చేయాలని, మట్టి నమూనాలు సేకరించాలని, పంట కోత ప్రయోగాలను రైతులకు వివరించాలన్నారు. అనంతరం వారి సందేహాలను నివృత్తి చేశారు.

వర్షార్పణం..



రేణిగుంట రైల్వే స్టేషన్ సమీపంలో నిలిచిన నీరు

రేణిగుంట: గత కొన్ని రోజులుగా ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో చల్లబడ్డారు. ఈ వర్షానికి లోతట్టు రహదారులు జలమయమయ్యాయి. ముఖ్యంగా రేణిగుంట రైల్వే స్టేషన్ పరిసరాలు వర్షపు నీరు, మురుగునీరు కలిసి రోడ్లపై నిలిచాయి. ప్రధాన కాలువలో వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల వర్షం పడితే కాలువల్లో మురుగు రోడ్లపై నిలుస్తుంటాయి. వివిధ ప్రాంతాల నుంచి రేణిగుంటకు వచ్చే ప్రయాణికులు మురుగునీరులోనే నడుచుకుంటూ వెలుపలకు రావాల్సిన పరిస్థితి ఉంది. వర్షం వచ్చిన ప్రతిసారీ ఇలాగనే జరుగుతున్న పాలకులు.. అధికారులు పట్టించుకోవడం లేదు. ఎప్పుడైనా రైల్వే, పంచాయతీ అధికారులు కలిసి సమస్యను పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో ఆణివార ఆస్థానం



ఆణివార ఆస్థానం నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: టీటీడీ అనుబంధ పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం ఆణివార ఆస్థానం ఘనంగా నిర్వహించారు. ఏటా ఆయనాల ప్రారంభ సందర్భంగా ఆలయంలో పెద్దశేష వాహనంపై శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరునికి నూతన వస్త్రాలను సమర్పించి, ఆస్థానం నిర్వహించడం సాంప్రదాయం.. ఏటా తమిళ ఆణి మాసం చివరి రోజున దక్షిణాయ పుణ్యకాలం ప్రారంభమవుతుంది. ఈ సందర్భంగా ఆలయంలో ఆస్థానం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు శుద్ధి, తోమాల, అర్చన, గంట, దక్షిణాయన ప్రారంభ కాలంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకన్నకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం ఉయ్యాల మండపంలో శేషవాహనంపై ఉభయదేవరుల సమేత వెంకన్నను కొలువుదీర్చారు. టీటీడీ తరపున ఆలయ అధికారులు సమర్పించిన పట్టు వస్త్రాలను ఉత్సవ మూర్తులకు అలంకరించారు. ఆలయంలో నిర్వహించే పద్దుల పుస్తకాలను స్వామివారి చెంత ఉంచి, అర్చకులు ఆస్థానం నిర్వహించి, భక్తులకు అక్షింతలను, తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చంద్రబాబు అబద్ధాలను ప్రజలకు చెబుదాం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: ఎన్నికల ముందు చంద్రబాబు చెప్పిన అబద్ధాలను ప్రజలకు చాటిచెప్పడమే బాబూ ష్యూరిటీ..మోసం గ్యారంటీ కార్యక్రమం లక్ష్యమని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ అన్నారు. బుధవారం మండల పర్యటనకు వచ్చిన ఆయన చిలమత్తూరులో పార్టీ శ్రేణులతో కలసి పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, మండలస్థాయిలో నిర్వహించే బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం నియోజకవర్గంలో విజయవంతమయ్యేందుకు అందరి సమన్వయంతో ముందుకు వెళ్దామన్నారు. అనంతరం ఈ నెల 21 నుంచి అదే కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికల ముందు చంద్రబాబు అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక వాటిని నెరవేర్చకుండా ఎంతగా దగా చేశారో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి కార్యకర్తా చొరవ చూపాలని కోరారు.

గతంలో కూడా బాబు ఇలానే..

అలాగే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండలంలో ఏర్పాటు చేసిన వివిధ అభివృద్ధి పనులు, నిర్మాణాలను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి ఎన్నికల్లో చంద్రబాబు అబద్ధాలు చెప్పి వంచించడమే ఆయన నైజమని, 2014లో 600 హామీలిచ్చి ఒక్కటీ నెరవేర్చలేదని, అలాగే 2024లో కూడా సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలిచ్చినప్పటికీ పూర్తిస్థాయిలో నెరవేర్చలేదని దుయ్యబట్టారు. వీటి గురించి ప్రజలకు మరోసారి బలంగా చాటి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికార ప్రతినిధి చిన్నా, సీనియర్ నాయకులు దామోదర్ రెడ్డి, మండల ప్రచార కమిటీ అధ్యక్షులు చిలమత్తూరు భాస్కర్ రెడ్డి, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ ప్రభాకర్, రాష్ట్ర యూత్ కార్యదర్శి శిబిచక్రవర్తి, నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు పెద్దిరెడ్డి మల్లికార్జునరెడ్డి (వ్యవసాయ), బందిల సురేష్ (బూత్ కమిటీ), దేవళ్ల మహేంద్ర (బీసీ సెల్), వినోద్ యాదవ్ (యువజన), శివా యాదవ్ (ప్రచార), మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, సర్పంచులు రమణయ్య, సన్యాసయ్య, విజయ్ కుమార్, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు సారె సమర్పణ



సారె అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ కొండమిట్ట అమ్మవారికి జాతరను పురస్కరించుకుని బుధవారం మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో సారె సమర్పించారు. కమిటీ సభ్యులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అర్చకులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి దయతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలనిఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, జనమాల గురవయ్య, ఎంఆర్ మురళి యాదవ్, మాజీ కౌన్సిలర్ ఉత్తరాది శరవణ కుమార్, కంట ఉదయ్ కుమార్, దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు సాధన మున్నా రాయల్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు పఠాన్ ఫరీద్, కొల్లూరు హరినాథ్ నాయుడు, బాల్ శెట్టి విజయ్ శేఖర్, జూమ్లేష, షఫీ, కనిపాకం సురేష్, అస్లాం, పెరుమాళ్ చౌదరి, మల్లెంబాకం మునికృష్ణారెడ్డి, చెంబేటి సురేష్, శివ, వెంకీ, భాను, మణి, సుబ్రహ్మణ్యం మహిళలు పాల్గొన్నారు.

వివాదాస్పద భూమిలో అక్రమ నిర్మాణాలు



వివాదాస్పద భూమిలో నిర్మించిన షెడ్, భూమిలో టెంట్ వేసుకుని పనులను పర్యవేక్షిస్తున్న చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు

రేణిగుంట: విమానాశ్రయ రహదారికి రన్‌వే మధ్యలో ఉన్న కొత్తపాలెం లెక్క దాఖలు సర్వేనంబర్ 103/6లో గత కొన్ని నెలలుగా వివాదం కొనసాగుతోంది. ఒకే భూమిని ఇద్దరు వ్యక్తులు తమదంటే తమదని బ్రిటీష్ కాలం నాటి పత్రాలను పట్టుకుని తిరుగుతున్నారు. ఇప్పుడు వీరిద్దరు కాదని బుధవారం మూడో వ్యక్తి ఈ భూమిలో ఒక 1.62 ఎకరాలు తనకు ఉందని.. తన పేరిట పత్రాలు, పాసుబుక్ ఉందని సుమారు 30 మంది బౌన్సర్లను పెట్టి పనులు మొదలు పెట్టారు. ఏకంగా వివాదాస్పద భూమిలో శరవేగంగా తాత్కాలిక షెడ్డు, కాంపౌండ్ వాల్ పనులు చేపట్టారు. అక్కడే టెంట్ వేసి తన మనుషులతో పనులు పర్యవేక్షిస్తున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి వెంటనే ఆర్ఐ జయకృష్ణ, వీఆర్వో శంకర్‌ను సంఘటనా స్థలానికి పంపించి తాత్కాలికంగా పనులు నిలుపుదల చేయాలని ఆదేశించారు. రెవెన్యూ సిబ్బంది పనులు ఆపమని ఆదేశించి వెనుదిరిగిన అనంతరం కొంతసేపటికే సదరు మూడో వ్యక్తి యథావిధిగా పనులు చేయించడం గమనార్హం.

తహసీల్దార్ ఏమంటున్నారంటే..!

2014లో రేణిగుంట తహసీల్దార్‌గా పని చేసిన అధికారి అప్పట్లో ప్రైవేట్ వ్యక్తికి ప్రభుత్వ భూమిని సెటిల్‌మెంట్ చేశారని.. సదరు వ్యక్తి ఆ కాపీని పెట్టుకుని గతంలో పని చేసిన తహసీల్దార్ వద్ద పాస్‌బుక్, సబ్ డివిజన్ చేయించుకున్నాని తెలిపారు. ప్రస్తుతం పనులు నిలుపుదల చేయండని చెబితే తమది సెటిల్‌మెంట్ భూమి అని.. తమకు అన్ని పత్రాలు ఉన్నాయని.. ఎందుకు పనులు ఆపాలని చెబుతున్నారని అన్నారు. గతంలో చేసిన సెటిల్‌మెంట్ సరైనదేనా అనే విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లామని.. సెటిల్‌మెంట్ తప్పు అని తెలిస్తే ఆక్రమణలను తొలగిస్తామన్నారు.